క్లుప్తంగా

తారాలో సాంస్కృతిక కార్యక్రమాలు


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కొండాపూర్(సంగారెడ్డి): దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించినట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రవీణ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు తెలంగాణ బతుకమ్మ బోనాలు, జానపదాలు, నృత్య ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమాలను న్యాయ నిర్ణేతలుగా డా పద్మజ, డా జ్యోత్స్న, డా మంజు శ్రీ, డా విజయ వ్యవహరించారు.

మెరుగైన విద్యనందించాలి


ఉపాధ్యాయులతో సమావేశమైన నాయకులు

నారాయణఖేడ్: విద్యార్థులకు మెరుగైన సేవలు అందించాలని నారాయణఖేడ్ మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనానజీబ్ సూచించారు. శనివారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో సమావేశమైన ప్రభుత్వ బడుల్లో కల్పిస్తున్న సదుపాయాలను తల్లిదండ్రులకు వివరించి పిల్లలు ప్రభుత్వ బడుల్లో చేరేలా చూడాలని అన్నారు. కౌన్సిలర్ కవిత విఠల్ పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు


క్యూలైన్‌లో భక్తులు

నారాయణఖేడ్: మండలంలోని కొండాపూర్‌లోని హనుమాన్ ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి హనుమాన్‌ను దర్శించుకున్నారు.

ఎంపీ బీబీ పాటిల్‌ను కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు


ఎంపీని సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

న్యాల్‌కల్(జహీరాబాద్): జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు బీబీ పాటిల్‌ను శనివారం బీఆర్‌ఎస్ నాయకులు కలిశారు. ఉదయం హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లిన బీఆర్‌ఎస్ నాయకులు భాస్కర్, విజయ్, తిమోతీ తదితరులు మర్యాద పూర్వకంగా కలిశారు. న్యాల్‌కల్ మండలంలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతి తదితర విషయాలను ఎంపీ నాయకులను అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండల పరిధిలోని ఆత్మకూర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన 90మంది విద్యార్థులకు సంగారెడ్డి పట్టణానికి చెందిన వ్యాపారి సతీశ్ శనివారం నోటుబుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి అంజయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దాత సతీశ్‌కు మండల విద్యాధికారి అంజయ్య ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా ఏనికేపల్లి ప్రభుత్వ పాఠశాలను మండల విద్యాధికారి అంజయ్య సందర్శించారు.కార్యక్రమంలో హెచ్‌ఎం తుకారాం, జయంతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చెత్త సమస్యను పరిష్కరించాలి

కొండాపూర్(సంగారెడ్డి): సంగారెడ్డి పట్టణంలో నెలకొన్న చెత్త సమస్యకు వెంటనే పరిష్కారం చేయాలని, గ్రేడ్ వన్ మున్సిపాలిటీగా పేరొందిన సంగారెడ్డి మున్సిపాలిటీకి శాశ్వతమైన డంప్‌యార్డు లేకపోవడం పాలకుల నిర్లక్ష్యమేనని గొల్లపల్లి జయరాజ్ అన్నారు. శనివారం చెత్త సమస్యను పరిష్కరించాలని కోరుతూ అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంగారెడ్డి పట్టణంలో చెత్త సేకరణ నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పట్టణంలో ప్రతిరోజు 55 మెట్రిక్ టన్నుల చెత్తను సేకరిస్తున్నా వీటికి సరిపడా డంపింగ్‌యార్డ్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాల ప్రారంభ రీత్యా అంటువ్యాధులు ప్రబలకుండా అధికారులు స్పందించి చెత్త సేకరణకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమానికి పెద్దపీట


జిన్నారం(పటాన్‌చెరు): కొత్తపల్లి తండాలో మహిళలతో కలిసి నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని, తండాలను గ్రామ పంచాయతీలుగా అభివృద్ధి చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దేనని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. జిన్నారం, గుమ్మడిదల మండలాల్లోని కొత్తపల్లి, రాళ్లకత్వ తండాల్లో దశాబ్ది వేడుకల్లో భాగంగా శనివారం నిర్వహించిన గిరిజన దినోత్సవ కార్యాక్రమాల్లో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు. గిరిజనులతో కలిసి నృత్యాలు చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. గిరిజనుల అభివృద్ధిలో భాగంగా తండాలను గ్రామ పంచాయితీలుగా సీఎం కేసీఆర్ మార్చారన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమాల్లో జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ ప్రవీణ, జెడ్పీటీసీ కుమార్‌గౌడ్‌లతో పాటు గిరిజన గ్రామాలకు చెందిన నాయకులు, పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రాష్ట్రంలో గిరిజనుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దేనని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్‌తండా, వెలిమెల తండాల్లో గిరిజన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. గిరిజనుల జీవితాల్లో వెలుగు నింపి తండాలను అభివృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దిన ఉన్నతమైన నాయకుడు కేసీఆర్ అని అన్నారు. నియోజకవర్గంలోని 5 తండాల్లో తన సొంత నిధులతో సంత్ సేవాలాల్, భవాని మాతల ఆలయాలను నిర్మించడంతో పాటు వారి ఆర్థిక అభ్యున్నతికి సంపూర్ణ సహకారాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి, వైస్ చైర్మన్ రాములుగౌడ్‌లు పాల్గొన్నారు.

పుల్‌కల్(అందోల్): గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ తెలిపారు. మండల పరిధిలోని లాల్‌సింగ్ తండాలో శనివారం దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన గిరిజన దినోత్సవంలో పాల్గొని ప్రసంగించారు. సీఎం కేసీఆర్ గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి గిరిజనులకు స్వయం పాలనను అందించారని తెలిపారు. తండాల్లో గిరిజనులే సర్పంచ్‌లుగా చలామని అవుతున్నారని తెలిపారు. అంతకుముందు భవాని మాత ఆలయం వద్ద భోగ్ భండార్ కార్యక్రమం నిర్వహించి నూతనంగ ఏర్పాటైన లాల్‌సింగ్ నాయక్ తండాకు నూతన గ్రామ పంచాయతీ భవనానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మధులత, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఎంపీటీసీ సుశీల పాల్గొన్నారు.

సంగారెడ్డిటౌన్: సంగారెడ్డి మండలంలోని గుడితండా గ్రామంలో గిరిజనులు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీఓ రవీందర్ హాజరయ్యారు. తండాప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఊరేగింపుగా వచ్చి భవాని మాత ఆలయంలో పూజలు నిర్వహించారు. మహిళలు ఆటపాటలతో ఉత్సాహంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో తండావాసులు తదితరులు పాల్గొన్నారు.

వట్‌పల్లి(అందోల్): గిరిజనుల సమగ్రాభివృద్ధికి సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. శనివారం మండలంలోని మంచిర్యాల తండాలో నిర్వహించిన గిరిజన ఉత్సవాల్లో ఆమన హాజరయ్యారు. ఆయనకు తండావాసులు ఘనంగా స్వాగతం పలుకగా, గిరిజన మహిళలతో కలిసి నృత్యం చేశారు. రూ.20లక్షలతో మంజూరైనా నూతన గ్రామపంచాయతీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి గిరిజన బిడ్డల కలను సాకారం చేశారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దీప్లానాయక్, జాగృతి రాష్ట్ర నాయకులు భిక్షపతి, ఎంపీపీ పత్రి కృష్ణవేణి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షురాలు పి. సురేఖ, సర్పంచ్ ఖయ్యూం, వరం చైర్మన్ వీరారెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు నర్సింలు, పీఏసీఎస్ డైరెక్టర్ బుద్దిరెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు అశోక్‌గౌడ్, బీఆర్‌ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శివాజీ రావు, ఏఎంసీ డైరెక్టర్ మధు, నాయకులు బస్వరాజ్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్: సీఎం కేసీఆర్ నేతృత్వంలోనే గిరిజన తండాల అభివృద్ధికి బాటలు పడ్డాయని నారాయణఖేడ్ ఎంపీపీ చాందీబాయి చౌహాన్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని చల్లగిద్ద తండాలో నిర్వహించిన గిరిజన దినోత్సవంలో ఆమె పాల్గొన్నారు. తండావాసులతో కలిసి తండాలో ప్రదర్శనతో పాటు భవానీ మాత ఆలయ ఆవరణలో భోగ్‌బండార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్ చౌహాన్, సర్పంచ్ సుశీల, తండావాసులు పాల్గొన్నారు. నిజాంపేట్ మండలంలో మేఘ్యానాయక్ తండా, రామ్దస్ తండా, కిర్యా తండా, తుక్యా తండాల్లో నిజాంపేట్ సర్పంచ్ జగదీశ్వరాచారి ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు.


రామచంద్రాపురం(పటాన్‌చెరు): గిరిజన మహిళలతో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి


పుల్‌కల్(అందోల్): జీపీ భవనానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్


నారాయణఖేడ్: నిజాంపేటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

'హామీలను విస్మరించి ఉత్సవాలా?'

నారాయణఖేడ్: ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలకు ఏం చేశారని దశాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తున్నారని వైఎస్సార్ తెలంగాణ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాపు మల్‌శెట్టి ప్రశ్నించారు. నారాయణఖేడ్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం విలేకర్లతో మాట్లాడుతూ... దళితులకు మూడెకరాల చొప్పున భూమి పంపిణీ, రైతులకు రూ.లక్ష రుణ మాఫీ, నిరుద్యోగ భృతి, ఇంటికో ఉద్యోగం, ఎస్టీలు, ముస్లింలకు 12శాతం చొప్పున రిజర్వేషన్లు, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య ఇలా అనేక హామీలు హామీలుగానే మిగిలిపోయాయని తెలపారు. ఎన్నికలు దగ్గరపడుతున్నందున ప్రజలను మరోసారి మభ్యపెట్టేందుకు దశాబ్ది ఉత్సవాల పేరిట ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్నారు.


మాట్లాడుతున్న బాపుమల్‌శెట్టి

'బీఎల్‌ఓ విధుల నుంచి తప్పించాలి'

న్యాల్‌కల్(జహీరాబాద్): బీఎల్‌ఓ విధుల నుంచి తమను తప్పించాలని కోరుతూ శనివారం పంచాయతీ కార్యదర్శులు తహసీల్దార్ మునిరొద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ.. ఇతర మండలాల్లో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శులకు బీఎల్‌ఓ బాధ్యతలు అప్పగించలేదని, ఇక్కడ మాత్రం తమకు బీఎల్‌ఓలుగా అదనపు బాధ్యతలు అప్పగించడం వల్ల పని భారం ఎక్కువై ఇబ్బందులు పడుతున్నామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు ప్రవీణ్, సంతోష్‌కుమార్, ప్రతాప్‌రెడ్డి, ఈశ్వర్, జ్యోతి, లక్ష్మి, శిల్పా, ఇంద్రజ, అశ్వినీ తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

ఉపాధ్యాయుడికి పురస్కారం

సంగారెడ్డి టౌన్: పట్టణంలోని స్థానిక సెయింట్ ఆంథోని విద్యా సంస్థలో తెలుగు భాష ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న ఉమ్మన్నగారి కృష్ణా గౌడ్‌కు ప్రైడ్ ఆఫ్ తెలంగాణ పురస్కారం వరించింది. 16 తేదీ శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సాహితీ కళా సేవా సమితి ఆధ్వర్యంలో ఈ పురస్కారం అందుకున్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు స్వప్నకిషోర్, దైవజ్ఞశర్మ, అధికారులు, నాయకులు, సినీనటులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్ట్

వట్‌పల్లి(అందోల్): మండలంలోని మంచిర్యాల తండాలో శనివారం జరిగే గిరిజన ఉత్సవాలకు అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ హాజరవుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దుద్యాల రోడ్డు విషయమై ఎమ్మెల్యే పర్యటనను అడ్డుకుంటారనే నేపథ్యంలో వారిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ అంబర్యా తెలిపారు. దుద్యాల కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌ను ముందస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించిన విషయం తెలిసిన మండల యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌గౌడ్, ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు ఖాజా, పోచయ్య, రాందాసులు నాయకులు రాహుల్, ప్రవీణ్‌గౌడ్, పోచయ్యలకు సంఘీభావంగా వెళ్లి పోలీసులను ప్రశ్నించగా వారిని కూడా అదుపులోకి తీసుకున్నట్లు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.

ఉచిత బస్‌పాస్‌ల పంపిణీ


బస్‌పాస్ అందజేస్తున్న డీఎం మల్లేశయ్య

నారాయణఖేడ్: నారాయణఖేడ్ ఆర్టీసీ బస్టాండ్‌లోని బస్‌పాస్‌ల కౌంటర్‌లో శనివారం డీఎం మల్లేశయ్య పలువురు విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌లను పంపణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న 12 ఏళ్ళలోపు వయస్సుగల బాలురకు, 18 ఏళ్ళలోపు వయస్సుగల బాలికలకు ఉచిత బస్‌పాస్‌లు అందజేస్తున్నామని అన్నారు. బస్‌పాస్ కౌంటర్‌లో గుర్తింపు కార్డు జిరాక్స్ ప్రతితో పాటు రూ.50 రుసుము చెల్లించి పాస్‌లు పొందాలని సూచిస్తూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు ట్రాఫిక్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్‌ను 94940 93486, బస్టాండ్ మేనేజర్ పాండును 94410 71134 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సంక్షిప్త వార్తలు

◆ అంత్యక్రియలకు ఆర్థిక సాయం

జిన్నారం(పటాన్‌చెరు): బొంతపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి దాసు శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి స్పందించి అంత్యక్రియలకు గాను రూ.10వేల ఆర్థిక సాయం ప్రకటించారు. ఇందుకు సంబంధించిన నగదును స్థానిక నాయకులు ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, హుస్సేన్‌లు మృతుడి కుటుంబసభ్యులకు అందించారు.

◆ వైద్య ఖర్చులకు సాయం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలం పాశమైలారం గ్రామానికి చెందిన దుర్గమ్మ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఎస్‌ఎంఆర్ యువసేన సభ్యుడు కాశంగారి పాండు తనవంతు సాయంగా వైద్య ఖర్చుల కోసం రూ.10వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణ, వార్డుసభ్యులు నవీన్‌రెడ్డి, రమేశ్, శంకరయ్య, రాములు, మాజీ ఎంపీటీసీ శ్రీను, ఎస్‌ఎంఆర్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

◆ హనుమాన్ ఆలయ అభివృద్ధికి విరాళం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని మాచిరెడ్డిపల్లి గ్రామంలో హనుమాన్ ఆలయ అభివృద్ధికి డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం రూ.లక్ష విరాళాన్ని శనివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు, సర్పంచ్ డప్పు చప్పుళ్లతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అమృతయేసయ్య, ఎంపీపీ మనోజ్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ నేడు జహీరాబాద్‌లో కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల పర్యటన

జహీరాబాద్: ఈ నెల 18వ తేదీన జహీరాబాద్ పట్టణంలో కేంద్ర పశుసంవర్ధక శాఖ మంత్రి పురుషోత్తం రూపాల పర్యటించనున్నట్లు బీజేపీ వర్గాలు తెలిపాయి. కావున జహీరాబాద్‌లో ఆదివారం చేపట్టే కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

◆ 19 వరకు ధ్రువపత్రాల పరిశీలన

సంగారెడ్డిటౌన్: పాలిసెట్ 2023 ధ్రువపత్రాల పరిశీలన సంగారెడ్డి మండలంలోని హనుమాన్ నగర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 19 వరకు కొనసాగుతుందని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు అన్నారు. మొదటిరోజు 235 మంది విద్యార్థులు హాజరయ్యారని, రెండోరోజు 240 మంది హాజరయ్యారన్నారు. ధ్రువపత్రాల పరిశీలన ఈనెల 19వరకు కొనసాగుతుందని పరిశీలనకు హాజరైన విద్యార్థులు 21వరకు ఆప్షన్లు పెట్టుకోవచ్చన్నారు. సీట్ అలాట్మెంట్‌లు ఈ నెల 25వ తేదీన జరుగుతుందని సెల్ఫ్ రిపోర్టింగ్‌కు ఈ నెల 25 నుంచి 29వ తేదీవరకు ఉంటుందని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

◆ వృద్ధ మహిళలను వేధించడం నేరం

పటాన్‌చెరు టౌన్: వృద్ధ మహిళలను వేధించడం నేరమని.. వారికి ఆర్థిక భరోసా సామాజిక భద్రత కల్పించడం అందరి బాధ్యతని హెల్ప్ ఏజ్ ఇండియా సంస్థ ప్రతినిధి సాంబరాజు అన్నారు. శనివారం ప్రపంచ వృద్ధులపై హింస వేధింపుల నివారణ దినం సందర్భంగా పటాన్‌చెరు మండలం ముత్తంగి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సాంబరాజు మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి మానవత దృక్పథాన్ని అలవరుచుకోవాలని వృద్ధులను ప్రేమానురాగాలతో వారి బాగోగులు చూసుకోవాలని కోరారు

ఇంటింటి సర్వేను త్వరగా పూర్తి చేయాలి


సమావేశంలో వివిధ రాజకీయ పార్టీలప్రతినిధులు

డిప్యూటీ తహసీల్దార్లు మధుకర్‌రెడ్డి, చంద్రశేఖర్

జోగిపేట(అందోల్): ఇంటింటి సర్వేను పోలింగ్ కేంద్రాల వారీగా పూర్తి చేయాలని అందోల్ డిప్యూటీ తహసీల్దార్లు మధుకర్‌రెడ్డి, చంద్రశేఖర్ సూచించారు. శనివారం జోగిపేటలోని తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ... 18 ఏళ్ల ఉన్న ప్రతీ ఒక్కరు తప్పనిసరిగా ఓటర్ జాబితాలో పేరును నమోదు చేసుకోవాలన్నారు. రెండో విడత ఓటర్ల జాబితా రూపకల్పనలో భాగంగా ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం బీఎల్‌ఓలు పోలింగ్ బూత్‌ల వారీగా చనిపోయిన, ఇళ్లు మారిన, శాశ్వతంగా తొలగించిన ఓటర్ల వివరాలను యాప్‌లో నమోదు చేయాలని బీఎల్‌ఓలకు సూచించారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు లక్ష్మీకాంతరెడ్డి, మున్సిపల్ చైర్మన్ జి.మల్లయ్య, బీజేపీ ప్రతినిధి ప్రభాత్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శివరాజ్ వైఎస్సార్ తెలంగాణ పార్టీ జిల్లా యువజన విభాగం కార్యదర్శి రమేశ్, బీఎస్‌పీ నాయకుడు దాసరి దుర్గయ్య సీపీఎం కార్యదర్శి విద్యా సాగర్‌లు పాల్గొన్నారు.

బండి సంజయ్ నేతృత్వంలోనే పనిచేస్తాం

బీజేపీ సీనియర్ నాయకుడు వివేక్ వెంకట స్వామి


మాట్లాడుతున్న వివేక్ వెంకట స్వామి

జహీరాబాద్ టౌన్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ నేతృత్వంలోనే సమష్టిగా పనిచేస్తామని, అధ్యక్షుడి మార్పు ఉండదని మాజీ ఎంపీ, సీనియర్ నేత వివేక్ వెంకటస్వామి అన్నారు. జహీరాబాద్‌లోని ప్రైవేట్ కార్యక్రమంలో హాజరైన వివేక్ శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాబోవు ఆరు నెలల్లో ఎన్నికలు పెట్టుకొని అధ్యక్షుడి మార్పు చేయాల్సిన అవసరం లేదన్నారు. బండి సంజయ్ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత 8శాతం ఉన్న ఓటు బ్యాంకు 35 శాతానికి పెరిగిందని గుర్తు చేశారు. బలమైన నాయకుడిగా బండి సంజయ్ దుబ్బాక, హుజూరాబాద్, జీహెచ్‌ఎంసీలో పార్టీకి విజయాన్ని అందించారన్నారు. మునుగోడులో సైతం నైతికంగా బీజేపీ విజయం సాధించిందని సాంకేతికంగా మాత్రమే బీఆర్‌ఎస్ గెలిచిందన్నారు. కాంగ్రెస్ పార్టీలో మాదిరి బీజేపీలో అంతర్గత విభేదాలు ఉండవని రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఐక్యంగా పనిచేస్తామన్నారు. కొందరు పనిగట్టుకొని బీజేపీ అధ్యక్ష మార్పుపై పుకార్లు పుట్టించి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో బీజేపీ నాయకులు రాజనరసింహ రాంచందర్, సుధీర్‌కుమార్, జగన్నాథ్, శ్రీనివాస్‌గౌడ్, జనార్దన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

'నీట్' ర్యాంకర్‌కు సన్మానం


మనస్వినిని సన్మానిస్తున్న రవికిరణ్

జహీరాబాద్ టౌన్: దేశవ్యాప్తంగా వైద్య కళాశాలలో ప్రవేశాల కోసం నిర్వహించిన ×నీట్× పరీక్షలో మంచి ర్యాంక్ సాధించిన మనస్విని నామ సుభద్రమ్మ ట్రస్టు అధ్యక్షుడు నామ రవికిరణ్ శనివారం సన్మానించారు. పట్టణంలోని దత్తగిరి కాలనీలో నివాసం ఉంటున్న హద్నూర్ మాతంశెట్టి చంద్రశేఖర్ కుమార్తె మాతంశెట్టి మనస్విని 720 మార్కులకు 645 మార్కులు సాధించి జహీరాబాద్ టాపర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా నామ రవికిరణ్ మాట్లాడుతూ.. వైద్యురాలిగా శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం జహీరాబాద్ ప్రాంత ప్రజలకు వైద్య సేవలను అందించాలని ఆకాంక్షించారు. మనస్విని మంచి మార్కులు సాధించడానికి సహాయ సహకారాలను అందించిన కుటుంబ సభ్యులను అభినందించారు. ప్రతిభవంతులను ట్రస్టు ఎప్పుడు ప్రోత్సహిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు నరేశ్‌రెడ్డి, సందీప్‌రాజ్‌లు ఉన్నారు.

బాగారెడ్డికి నివాళి

జహీరాబాద్: దివంగత మాజీ మంత్రి బాగారెడ్డికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు ఘనంగా నివాళులర్పించారు. శనివారం బాగారెడ్డి జయంతిని పురస్కరించుకొని జహీరాబాద్ పట్టణంలోని ఆయన స్వగృహంలో డీసీసీబీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎం.జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్‌చేశారు. అనంతరం ఆయన విగ్రహం వద్దకు ర్యాలీగా వెళ్లి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జహీరాబాద్ ప్రాంతానికే కాకుండా జిల్లాకు, రాష్ట్రానికి అందించిన సేవలు ఎనలేనివని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎం.జైపాల్‌రెడ్డి, వై.నరోత్తం, రామలింగారెడ్డి, జి.భాస్కర్, యూసూఫ్, సద్రుద్దీన్‌గౌరి, సునీల్‌కుమార్, బిచ్చిరెడ్డి, పాండురంగారెడ్డి, అప్సర్ దిల్‌దార్, నాగిశెట్టి పాల్గొన్నారు.


బాగారెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న జైపాల్‌రెడ్డి, నాయకులు

కౌడిపల్లిలో ముగ్గుల పోటీలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లి ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో శనివారం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కిషన్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆదివారం నీళ్ల పండగ భగీరథ కార్యక్రమం ఉండగా కౌడిపల్లిలో ముందస్తుగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు తాగునీరు నాడు, నేడు, హరితహారం, తదితర ముగ్గులు వేశారు. కార్యక్రమంలో ఏఈఈలు అరవింద్, ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశం, ఏపీఎం సంగమేశ్వర్, అంగన్‌వాడీ టీచర్లు, డ్వాక్రా మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.


ముగ్గులను పరిశీలిస్తున్న అధికారులు

ఖేడ్‌లో అభివృద్ధి కనిపించడం లేదా?

పెద్దశంకరంపేట(మెదక్): ఖేడ్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి చేసిన అభివృద్ధి కాంగ్రెస్ నాయకులకు కనిపించడం లేదా అని ఎంపీపీ శ్రీనివాస్ అన్నారు. శనివారం పెద్దశంకరంపేటలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో రహదారులు, సీసీ రోడ్లు, విద్యా, వైద్య రంగాలతో పాటు రైతులకు ఇబ్బందులు దూరం చేసేందుకు జొన్నల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్ష్మీరమేశ్, ఎంపీటీసీలు దత్తు, వీణసుభాష్‌గౌడ్, సర్పంచ్ రాములు, రైతుబంధు అధ్యక్షుడు సురేశ్‌గౌడ్, నాయకులు అశోక్, సూర్యప్రకాశ్, పున్నయ్య, శ్రీశైలం, మానిక్యం, వెంకయ్య, గంగారాం తదితరులున్నారు.